చిట్టికథ



# శిక్షణ

–సుధారమ

సాయంత్రం ఐదు గంటలు కావొస్తుంది. ఫిల్టర్‌లో డికాక్షన్‌కి వేస్తున్నాను. ఉత్సాహంగా పరుగెడుతూ వచ్చింది అయిదేళ్ళ మా పాప నమ్రత. 'అమ్మా, అమ్మా మనం ఇలాంటి బొమ్మని కొనుక్కుందామా' పక్కింటి పాప రమ్య చేతిలో ఉన్న బొమ్మని చూపిస్తూ అంది. ఆ బొమ్మ చాలా బావుంది. నాజూకుగా, అందంగా ఉన్న అమ్మాయి బొమ్మ చేతిలో తీసుకుని చూసాను. పక్కింటావిడ అంటూంటే విన్నాను వంద పైగానే దీని ఖరీదు. నాకు పాప అడిగిందల్లా కొనాలనిపిస్తుంది. పాపకి ఏ లోటూ లేకుండా పెంచాలి. ఎప్పుడూ సంతోషంగా మహారాణిలా ఉండాలి నా పాప. 'అలాగేనమ్మా నాన్నవచ్చాక అడిగి తీసుకుందామేం' అన్నాను.

ఆయన వచ్చి కాఫీ తాగాక అడిగాను బొమ్మ విషయం. ఆ బొమ్మని తీసుకుని చూస్తూ అన్నారు. 'మనకిది లగ్జరీ శారదా. పాపకిప్పుడున్న బొమ్మలు చాలు. హాయిగా ఆడుకోవడానికి.' ఒక్కసారిగా కోప మొచ్చింది నాకు. ఆయన లెఖ్ఖలో అన్నీ లగ్జరీ. కలర్ టి.వి, మెటల్ షిఫాన్ చీర, ఇంటికి కావల్సిన ఫర్నిచర్ - నా అవసరాల విషయంలో, ఇంటి అవసరాల విషయంలో ఎలాగో సర్దుకోగలను. పాప విషయంలో ఏ మాత్రం కాంప్రమైజ్ కావాలన్పించదు. మొన్నటికి మొన్న పాప పుట్టినరోజుకీ ఇలానే చేశారు. ఎంతో చక్కటి ఫ్రాక్ ఎంపిక చేసాను. రెండొందల పాతిక. అంత ఖరీదు పెట్టడం బొత్తిగా అనవసరం అని తేల్చేసారు. నా ఉత్సాహం చచ్చినట్లయింది.

మేమెలాగూ ఒక్కలాంటి జీవితం గడుపుతున్నాం. ఆయనకున్న నాలుగు జతల బట్టల్లో ఖరీదైనవి ఏవీ లేవు. నా చీరెలూ అంతే. చెప్పడానికి ఆయనకి ప్రభుత్వోద్యోగం. నెలకు రెండున్నర వేలు జీతం. ఏదో నేనూ నాలుగు ట్యూషన్లు చెప్తాను. పాపకి ఏదైనా కొనాలంటే ఇంత ముందు వెనుకలు చూడడం ఎందుకో అర్థం కాదు. ఏదో ఖర్చు మానుకునైనా పాపకి బొమ్మ కొనాలి. 'మీ బడ్జెట్ ఉపన్యాసాలు ఎప్పుడూ ఉన్నవేలెండి. పాపకి ఓ సారి బొమ్మ కొనిస్తే కొంపలేం మునగవు' గట్టిగానే అన్నాను . 'ఇంతకీ బొమ్మ పాపకా, ఈ బొమ్మకా' నవ్వుతో తేల్చేసారు. నాకు ఉడుకుమోత్తనంగా ఉంది. అయినా ఓ సారి ఆయన కాదంటే ఇక అంతే. "నేనే వెళ్ళి తీసుకొస్తే" అనుకున్నాను. కానీ, ఆయనకి అనవసరంగా కోపం తెప్పించడం ఎందుకు - ఇంట్లో ప్రశాంతతని చెడగొట్టడం నాకిష్టం లేదు.

మరుసటి రోజు మధ్యాహ్నం స్కూల్నుంచి వచ్చాక పాపకి అన్నం పెట్టాను. నేనూ అన్నం తింటూంటే పాప బొమ్మ కోసం మారాం మొదలెట్టింది. 'నమ్రతా, మన దగ్గరున్న బొమ్మలు చాల్లేమ్మా. ఆ బొమ్మ వద్దన్నారు నాన్న' మెల్లగా నచ్చజెప్పాను. వినకపోగా అల్లరి మొదలెట్టింది. పాపకి బొమ్మ కొనివ్వలేక పోయానన్న అసహనం— పాప అల్లరీ కలిసి నా ఓపికని చంపేసాయి. చెంపమీద లాగి ఒక్కటిచ్చాను. పాప ఏడుస్తూంది. దాని ఏడుపు వింటే అన్నం తినాలన్పించలేదు. ఏడుపులోనే అలిసి నిద్రకొరిగింది పాప.

పాపని పడుకోబెట్టి, వంటిల్లు శుభ్రం చేసి, పక్కింటి వాళ్ళ గిన్నె ఒకటి తిరిగివ్వాలని వెళ్ళాను. ఆమె పక్కవీధి రాధామణితో మాట్లాడ్డం విన్పిస్తూంది. అప్రయత్నంగా వినసాగాను. 'అయినా నువ్వెన్నయినా చెప్పు రమేష్ ఉత్తచవట. ఈ కాలంలో అట్లా మడి గట్టుకు కూర్చుంటే జరుగుతుందా? అదే సీటులో మా ఆయనుంటే ఈ పాటికి వాషింగ్ మెషీన్ కొనే దాన్ని. అందుకే వాళ్ళింట్లో పాపం కలర్ టి.వి. కూడా లేదు. అత్తారింటి కట్నాలూ అంతంత మాత్రమే ననుకుంటా' రాధామణి గొంతు. వాళ్ళు నన్ను గమనించే అవకాశం లేదు. చప్పున వెనక్కి తిరిగి వచ్చేసాను.

గిన్నెని అదిమి పట్టుకున్న నావేళ్ళు సన్నగా వణుకుతున్నాయి. నిద్రపోతున్న పాప ముఖంలో పసితనం. కందిన చెక్కిలిపై కన్నీటి చార నా మనసులో మాలిన్యపు మరకలా ఉంది. మెల్లగా ముద్దు పెట్టుకున్నాను. నా కాలేజీ రోజులు గుర్తొచ్చాయి. ఆ రోజుల్లో నాకు నాలుగు డ్రెస్సులకి మించి ఉండేవి కావు. పుస్తకాలకీ, ఫీజులకీ ఎంతో కష్టపడి తెచ్చిచ్చే వారు నాన్న. కానీ హృదయం నిండా ఆనందం ఉండేది. ఆదర్శాలుండేవి. చదువూ-స్నేహితులూ-పుస్తకాలూ-నేను కాలేజీ మేగజైన్‌కి లాల్‌బహుదూర్ శాస్త్రిగారి నిరాడంబర జీవితంపై రాసిన వ్యాసం గుర్తొచ్చింది. పాప విషయంలో నేనీ ఆలోచనలన్నీ ఎందుకు పక్కన పెట్టాను?

పాపకి కావాల్సిందల్లా కొని పెడితే పాప ఎట్లా తయారవుతుంది? పాపక్కావాల్సిన కాలిమువ్వల కోసం, ముత్యాల గొలుసు కోసం, బంగారు రింగుల కోసం ఆయనతో వాదించడం గుర్తు తెచ్చుకున్నాను. నా సాధింపుకు లొంగి ఆయన అడ్డదారి తొక్కి ఉంటే అందుకు బాధ్యత నాదే అయ్యేది. మా ఆయన వాళ్ళ దృష్టిలో చవట కావచ్చు. కానీ ఆయన వ్యక్తిత్వం నా ముందు మరింత ఉన్నతంగా అన్పించింది.

పాప నిద్రలో కదిలింది. అప్పుడనుకున్నాను. పాపకి అడిగిందల్లా— నేననుకున్నదల్లా కొని పెట్టడం కాదు ముఖ్యం. కోరికల కోసం ఆదర్శాలని అమ్ముకోకుండా బతకాలి పాప. అలా బతకాలంటే ఆత్మబలం కావాలి. అది సంపాదించుకోవడానికి తగిన శిక్షణ ఇవ్వడం నా కర్తవ్యం. అప్పుడు పాప కూడా మాలాగే ఆదర్శాల నిచ్చెన మీద పడిపోకుండా ఎక్కుతుంది నా మనస్సులో తుఫాను వెలిసి ప్రశాంతత నెలకొంది.

పాప దగ్గరున్న రబ్బరు బొమ్మకి ఒక చక్కటి గౌను కుట్టాను. గుడ్డముక్కలు జతచేసి, ప్లాస్టిక్ పూసలతో అలంకరించాను. నిద్రలేచిన పాప దాని బొమ్మని చూసి మురిసిపోయింది, 'ఎంత ముద్దుగా ఉందమ్మా నా పాప ఈ ఫ్రాక్‌లో. భలే బాగా కుట్టావు" అంటూ— నా పాప కూడా ముద్దుగా ఉందనుకున్నా— ఏదో సాధించినంత గర్వంగా ఉంది నాకు!

❑